పేదల చెంతకే వైద్యసేవలు

- ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 65, 66 వార్డుల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'


65వ వార్డులో ఆరోగ్యశ్రీ బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, జెడ్పీ ప్రసాద్


66వ వార్డులోని శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి


రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి డాక్టర్ మౌనిక


బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

గాజువాక: పేద, బడుగు బలహీనవర్గాలకు మెరుగైన వైద్యం అందాలన్న గొప్ప ఆలోచనతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ, పేదల చెంతకే వైద్యసేవలు అందించిన ఘనత మన సీఎంకే చెందుతుందన్నారు. 66వ వార్డు కొత్తగాజువాక ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేవలం జ్వరం వచ్చిన కారణంగా రోజుల్లోనే పలువురు తమ ఇళ్లవద్దే మృతి చెందిన సంఘటనలు గతంలో అనేకం చూశామన్నారు. అందరికీ సకాలంలో వైద్యం అందాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వైద్య సిబ్బందిని సైతం ఇంటింటికీ పంపించి వైద్య పరీక్షలను చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్టు వైద్యులను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఎంతటి ఖరీదైన వైద్యానికైనా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలతో ఉచిత వైద్యం అందిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్యులు 304 మందికి వివిధ పరీక్షలను నిర్వహించి అవసరమైనవారికి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ ప్రసాదరావు, వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, జీవీఎంసీ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, వైద్యాధికారి డాక్టర్ సెల్వియా మౌనిక, డీసీఎంఎస్ మాజీ చైర్ పర్సన్ పల్లా చినతల్లి తదితరులు పాల్గొన్నారు.

గిరిజా కాలనీలో 256 మందికి వైద్యసేవలు

పెదగంట్యాడ: 65వ వార్డు గిరిజా కాలనీ పీహెచ్‌సీ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ప్రత్యేక వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడితో కలసి ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందజేస్తున్నారన్నారు. ఆరోగ్య సమస్య ఏదైనా అన్ని వ్యాధులకు ఇక్కడే పరీక్షలు చేసేలా నిపుణులను అందుబాటులో ఉంచామని వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందుతోందన్నారు. దేశంలోనే మొదటి సారిగా మన రాష్ట్రంలోనే ఇటువంటి మంచి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అమలు చేస్తున్న ఆరోగ్య సురక్ష పథకం దేశానికే ఆదర్శమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సత్సంకల్పంతో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమం పేదల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తుందన్నారు. శిబిరంలో నలుగురు వైద్యులు పాల్గొని, 256 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ పీవీవీడీ ప్రసాద్ పీహెచ్‌సీ వైద్యాధికారి వరలక్ష్మి, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, నాయకులు ధర్మాల శ్రీను, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

చదువులమ్మకు వందనం


ఉక్కు త్రిశక్తి దేవాలయంలో సరస్వతి పూజల్లో పాల్గొన్న విద్యార్థులు

- వసంతి పంచమి వేళ విద్యార్థుల పూజలు
- చిన్నారులకు అక్షరాభ్యాసాలు


త్రిశక్తి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో మహా సరస్వతి

ఉక్కునగరం: వసంతి పంచమి వేళ అమ్మవారి సన్నిధి విద్యార్థులు, చిన్నారులతో కళకళలాడింది. చదువులమ్మకు ప్రత్యేక పూజలతో ప్రాంగణమంతా ఆధ్యాత్మిక, విద్యా సౌరభాలు వెదజల్లింది. సరస్వతీ దేవి జన్మించిన శుభతిథిగా భావించే శ్రీ పంచమిని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి దేవాలయంలో బుధవారం సరస్వతీ పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసాల్లో పెద్ద ఎత్తున తల్లిదండ్రులు తమ పిల్లలతో సహా హాజరయ్యారు. సాయంత్రం సరస్వతీ దేవికి సహస్ర నాగవల్లి పత్ర సహిత శ్వేత పుష్పార్చన చేశారు. అనంతరం బాలబాలికలతో సామూహిక సరస్వతీ పూజ చేయించారు.

- హనుమాన్ దేవాలయంలో ఉదయం సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో పుష్పాంజలి పూజ చేశారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అక్షరాభ్యాసాల్లో పలువురు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి మహా హారతి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్‌లో ఉక్కు ఉద్యోగికి బంగారు పతకం


అప్పారావుకు సర్టిఫికెట్ అందిస్తున్న సురేష్ సెల్వాజి

పెదగంట్యాడ: సూపర్ మాస్టర్స్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 13 వరకు గోవా జీఎంసీలోని బొలియన్ అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో వుడా కాలనీకి చెందిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి సత్తా చాటారు. బీఎఫ్ డిపార్ట్‌మెంట్‌లో జనరల్ ఫోర్‌మన్‌గా పని చేస్తున్న అండిబోయిన అప్పారావు ఈ గేమ్స్‌లో పాల్గొని 2024 ఇండియన్ చాంపియన్ షిప్ విజేతగా నిలిచి బంగారు పతకం సాధించారు. మాస్టర్ టూ బాడీవెయిట్ 93కిలోల విభాగంలో ఈ ఘనత సాధించారు. ఈ మేరకు ఆయనకు నేషనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహకుడు సురేష్ సెల్వాజి బంగారు పతకాన్ని బహూకరించారు. ఈ పోటీల్లో 18 రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు ప్రాంతీయ ఆస్పత్రి నిర్మించాలి


సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

ఉక్కునగరం: ఆర్టీసీ కార్మికుల కోసం విశాఖలో 25 పడకల ప్రాంతీయ ఆస్పత్రి నిర్మించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు కోరారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆయన స్టీల్‌సిటీ డిపోను సందర్శించారు. అక్కడ జరిగిన ఈయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో ఆస్పత్రి నిర్మిస్తే చుట్టుపక్కల జిల్లాలకు చెందిన ఉద్యోగులకు వైద్యసదుపాయం అందుతుందన్నారు. ఆర్టీసీ ఎండీ తిరుమలరావుకు లేఖ అందించామన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి పి.భానుమూర్తి, విజయనగరం జోనల్ అధ్యక్షుడు కె.జె.శుభాకర్, విశాఖ జిల్లా అధ్యక్షులు కె.ఎస్.ఎస్.మూర్తి, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

గాజువాక: స్థానిక పంతులుగారి మేడవద్ద ఏర్పాటు చేసిన బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు పార్టీ కార్యాలయం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

1098వ రోజుకు ఉక్కు దీక్షలు


దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకు ఎన్నాళ్లయినా, ఎన్నేళ్లయినా ఉక్కు ఉద్యమాన్ని ఆపేది లేదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1098వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని వివిధ విభాగానికి చెందిన కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు.

కణితి రోడ్‌లో విద్యుత్ స్తంభాల మార్పునకు చర్యలు

గాజువాక: కణితి రోడ్ విస్తరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న విద్యుత్ స్తంభాలను రోడ్డు పక్కకు మార్చేందుకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టారు. ముందుగా ఈ రోడ్‌లో 10 విద్యుత్ స్తంభాలను శుక్రవారం మార్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. వంటిల్లు జంక్షన్ నుంచి కొత్త గాజువాక జంక్షన్ వరకు ఈ రోడ్‌ను విస్తరిస్తున్న నేపథ్యంలో హెచ్‌టీ, ఎల్‌టీ సామర్థ్యం గల 80 విద్యుత్ స్తంభాలను, 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్ పక్కకు మార్చాలని జీవీఎంసీ అధికారులు కోరిన విషయం తెలిసిందే. దీనికోసం రూ.1.02 కోట్లను విద్యుత్ శాఖకు జీవీఎంసీ అధికారులు చెల్లించారు. దీంతో చర్యలు చేపట్టిన విద్యుత్ అధికారులు శుక్రవారం 10 విద్యుత్ స్తంభాలను మార్చాలని నిర్ణయించారు. ఈ స్తంభాలను వంటిల్లు జంక్షన్ నుంచి సాయిప్రియ ఫంక్షన్ హాల్ వరకు మార్చనున్నట్టు విద్యుత్ అధికారులు తెలిపారు. 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను కూడా రోడ్ పక్కకు మార్చేందుకు అవసరమైన దిమ్మలను నిర్మించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా దశలవారీగా స్తంభాలను మార్చనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 డీఈ బి.కె.నాయుడు తెలిపారు.

రేపు పలు ప్రాంతాల్లో అంతరాయం

ఈ కారణంగా ఈనెల 16న సనత్‌నగర్, 100 అడుగుల రోడ్ శివాలయం ఏరియా, సింహగిరి కాలనీ, కణితి రోడ్, అజీమాబాద్, నవాబ్‌నగర్, కై లాసనగర్, 60 అడుగుల రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అక్కిరెడ్డిపాలెం: 33/11 కేవీ బీహెచ్‌పీవీ ఎస్‌ఎస్‌లో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్-2, ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ డెయిరీ, భెల్ 33 కేవీ హెచ్‌టీ సర్వీసులు, షీలానగర్ అయాన్ డిజిటల్ ఆన్‌లైన్ సెంటర్, అక్కిరెడ్డిపాలెం ప్రాంతం, నాతయ్యపాలెం, మింది, రాంనగర్, పంతులుగారి మేడ, పాతగాజువాక, చిట్టినాయుడు కాలనీ, దశమికొండ, భెల్ టౌన్‌షిప్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు.

వడ్లపూడి పరిధిలో..

కూర్మన్నపాలెం: వడ్లపూడి విద్యుత్ సబ్‌స్టేషనల్లోని 33/11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున సంబంధిత ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీ, తిరుమల నగర్, ఈ-బ్లాక్ ఇండస్ట్రియల్ ఏరియా, అపెరల్ పార్కు ఇండస్ట్రియల్ ఏరియా, అప్పికొండ మరియు లక్ష్మీపురం ఆర్‌హెచ్ కాలనీ వంటి ప్రాంతాల్లోని ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. కావున ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

కూర్మన్నపాలెం పరిధిలో..

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం సబ్ స్టేషనల్లోని 33/11 కేవీ ఫీడర్ పరిధిలో పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. శాతవాహననగర్ రోడ్ నంబర్ 1 నుండి 9 వరకు, అశోక్‌నగర్, శివాజీనగర్, గౌరినగర్ శివసాయినగర్, యాతపాలెం, కూర్మన్నపాలెం, ముస్తఫా జంక్షన్ తదితర ప్రాంతాల్లో పైన పేర్కొన్న సమయంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

భక్తి, జ్ఞాన మార్గాల ద్వారానే భగవదనుగ్రహం


హనుమద్వైభవాన్ని వివరిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

ఎంవీపీకాలనీ: భక్తి, జ్ఞాన మార్గాల ద్వారా మాత్రమే భగవదనుగ్రహాన్ని పొందగలమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో నిర్వహిస్తున్న హనుమద్వైభవ ప్రవచనాల్లో భాగంగా ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఆంజనేయుడిని ఆరాధిస్తే సకల దేవతలను ఆరాధించినట్లే అన్నారు. పలు అధ్యాత్మిక అంశాలపై భక్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైతన్య బ్రదర్స్ భక్తి సంగీత విభావరి అలరించింది. ప్రవచనాల అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు. కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రవచనాలు బుధవారంతో ముగిశాయి.

16న గంట్యాడ వెంకాయమ్మ పరస


పరస పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

పెదగంట్యాడ: గంట్యాడ వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 16న పెదగంట్యాడ ఎస్సీ కాంప్లెక్స్ వద్ద పరస నిర్వహించనున్నామని ట్రస్ట్ అధినేత గంట్యాడ గోవిందరాజు తెలిపారు. పరస పోస్టర్‌ను ఎస్సీ కాంప్లెక్స్ వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పరస జరుగుతుందని గోవిందరాజు తెలిపారు. కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి, కాకినాడ పెంటారావు, గంట్యాడ పైడికొండ, ఎస్.రాజారావు, వెంకటేష్, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


సైన్స్ నమూనాలను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న కోరమాండల్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికివస్తుందని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం అన్నారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రతినిధులతో కలసి ఆమె ప్రారంభించారు. కోరమాండల్ సీఎస్ఆర్ ప్రతినిధి రాజీవ్, ఇంజినీర్లు అజయ్, ఖుషీ విద్యార్థుల నమూనాలను పరిశీలించి, వివరాలడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఈ నెల 28న సైన్స్ డే సందర్భంగా పలు పాఠశాలల్లో ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో ఎంపిక చేసిన వాటిని 28న కంపెనీలో ఎగ్జిబిషన్ నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.దేముళ్లు, కె.అన్నపూర్ణమ్మ, ఎస్‌వీఎస్.దేవి, జి.అనూరాధ, కె.అన్నపూర్ణేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక విగ్రహ ప్రాణ ప్రతిష్ట


వినాయకుడి సన్నిధిలో మేయర్ హరి వెంకట కుమారి, కార్పొరేటర్ ఇమ్రాన్ తదితరులు

గాజువాక: శ్రీ వినాయక హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 66వ వార్డు కై లాసనగర్‌లో నూతనంగా నిర్మించిన వినాయక ఆలయంలో బుధవారం విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక ప్రాంతంలోని భక్తులు పెద్ద సంఖ్యలో ఆదిదేవుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్న సమారాధన నిర్వహించారు. జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, భూపతిరాజు సుజాత, నాయకులు రెడ్డి జగన్నాథం, ఉరుకూటి అప్పారావు, కరణం వేణు, మోహన్, పేరం రామకృష్ణారెడ్డి, ఉరుకూటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేయర్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 15 సంవత్సరాలు నిండి, 45 సంవత్సరాల లోపు, ఇంటర్ చదివినవారు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94903 91324 నంబరులో సంప్రదించాలని సూచించారు.

'థింక్ బిగ్ గ్లోబల్'తో గొన్నా కళాశాల ఒప్పందం

అగనంపూడి: అగనంపూడి సమీపంలోని గొన్నా ఇంజనీరింగ్ కళాశాల థింక్ బిగ్ గ్లోబల్ సంస్థతో పరస్పర ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా థింక్ బిగ్ గ్లోబల్ సీఈఓ బనోజ్ అద్దంకి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో విద్యావిధానానికి అనుగుణంగా ఇక్కడి విద్యార్థులను తయారు చేస్తామన్నారు. గొన్నా కళాశాల కార్యదర్శి గొన్నా హేమచంద్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులకు మారుతున్న విద్యా సంస్కరణలకు అనుగుణంగా వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు వీలు కలుగుతుందన్నారు. భవిష్యత్తులో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు మరువలేం


దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సంజీవయ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, నాయకులు మస్తానప్ప, ధర్మాల శ్రీను, రాజాన వెంకటరావు, సంపూర్ణం, రోజారాణి, పల్లా పెంటారావు, వెంకటేష్, రామశాస్త్రి, కాకినాడ పెంటారావు, గంట్యాడ గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రేమికుల రోజు కాదు.. బ్లాక్ డే పాటిద్దాం'

భారీ త్రివర్ణ పతాకంతో మాజీ సైనికులు, స్వచ్ఛంద సంఘాల ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: పుల్వామాలో సైనికులపై ఉగ్రమూకల దాడి జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా గాజువాకలో మాజీ సైనికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి జై జవాన్, జై కిసాన్ నిదాలతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రమూకల దుశ్చర్యను ఖండించారు. 60 అడుగుల రోడ్‌లో ప్రారంభమైన ర్యాలీ పాతగాజువాక, గాజువాక మెయిన్ రోడ్ మీదుగా కొత్తగాజువాక వరకు, అక్కడ్నుంచి తిరిగి పాతగాజువాక వరకు కొనసాగింది. పుల్వామాలో 2019లో ఇదేరోజు ఉగ్రమూకలు చేసిన దాడిలో 40 మంది సైనికులు మృతి చెందారని, అందువల్ల ఈ రోజును ప్రేమికుల దినోత్సవానికి బదులుగా బ్లాక్ డేగా పాటించాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ జి.టి.వి.రమేష్, షేక్ సుభాన్, కిశోర్, అదిల్, శ్రీనివాస శర్మ, కృష్ణ కుమారి, సురేష్, పిన్నమనేని శ్రీనివాస్, గురుదీప్ సింగ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల పరస


పూజలందుకున్న సీతారాములు


పరసలో స్టాళ్ల వద్ద జనం సందడి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో కొలువైన శ్రీ సీతారాముల వారి పరస మహోత్సవాన్ని బుధవారం వైభవంగా జరిపించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి వెళ్లి, సీతారాములను దర్శించుకున్నారు. గ్రామంలో వీధులన్నీ జనంతో కిక్కిరిశాయి. రోడ్డుకు ఇరువైపులా అనేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీధులన్నీ విద్యుత్ దీపాలతో మెరిశాయి. ఆలయం వద్ద నిర్వహించిన గరిడీ, కోలాటం ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ నాయకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

16న సమ్మె జయప్రదం చేయాలి


స్టీల్ వర్కర్ సంచికను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు


భెల్ ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. ఎల్ఎంఎం పార్కులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సమ్మెపై స్టీల్ వర్కర్ సంచికను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో విసుగు చెందిన రైతులు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడితే తీవ్ర నిర్బంధాన్ని ఉపయోగించి అణచి వేయాలని చూడటం దుర్మార్గమన్నారు. కార్మిక, కర్షకుల సమస్యలను సమ్మె చేయడం ద్వారా పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి.దాస్, ప్రధాన కార్యదర్శి, నాయకులు శ్రీనివాసరాజు, కృష్ణమూర్తి, బి.మహేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ జంక్షన్‌లో ఆందోళన

పెదగంట్యాడ: ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మికుల గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఉక్కు అఖిల పక్ష సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పెదగంట్యాడ జంక్షన్‌లో బుధవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నందికి తాతారావు, మసేనురావు, మార్టుపూడి పరదేశి, పులి వెంకటరమణారెడ్డి, గుజ్జి గణపతి, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భెల్ కార్మికుల నిరసన

అక్కిరెడ్డిపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా భెల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టాయి. సంస్థ ప్రధాన గేటు వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.వి.ఎస్.రాజు, వి.ఆనందరావు, కొల్లి దేముడు, ఎస్.జగన్నాధరావు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.